ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 03 | ఏప్రిల్ | 2024
పేజీలు 8

## కాంగ్రెస్ సమావేశంలో బిఆర్ఎస్ ఎంఎల్ఎ



రాష్ట్రంలో బిఆర్ఎస్‌కు బై చెప్పిన మరో ఎంఎల్ఎ

2 లో

# బదిలీ ఉత్తర్వులు ఆపింది ఎవరు..?






-దోచుకుతిన్నారన్న వారు ఎందుకు మద్దతిస్తున్నారు
-చట్టానికి తూట్లు పొడిచినా చర్యలు తీసుకోరా...?
-చిరుద్యోగుల పైనేనా ఉన్నతాధికారుల ప్రతాపం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అక్రమాలు జరిగింది నిజమే. ప్రాథమిక విచారణలో అన్ని విషయాలు బహిర్గతమయ్యాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాల్సి ఉందన్న అధికారులు తొలి విడతగా అక్కడ అటెండర్‌ను బదిలీ చేశారు. సబ్ రిజిస్ట్రార్‌ను బదిలీ చేసేందుకు ఉత్తర్వులు సిద్ధం చేశారు. సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగికి వైరా సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. కానీ

మిగతా 2లో..

## చట్టసభలో ఏకైక ప్రజా గొంతుక సిపిఐ

- ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు కట్టుబడి పనిచేస్తానని కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు మరో తెలిపారు. మంగళవారం పాల్వంచ మండల పరిధిలోని సారేకల్లు, కారగట్టు, కోడిపుంజలవాగు, పూసలతండా, పుల్లయ్యగూడెం, పనుగుల, దేవిజాతండా, నాగారం కాలనీ, వీరునాయక్ తండా, బిక్కాతండా తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ గత పదేళ్లలో అభివృద్ధి కుంటుపడిందని, ఓ ప్రణాళిక బద్దంగా ఇక నుండి నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళదామని చెప్పారు. గ్రామాలకు కనీస వసతులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పాల్వంచ సమగ్రాభివృద్ధి కోసం ప్రణాళిక రచించామని చెప్పారు. ఇందులో భాగంగా త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయబోతున్నట్లు తెలిపారు.

మిగతా 2లో..

# ఛత్తీస్‌గడ్‌లో భారీ ఎన్ కౌంటర్



- 11 మంది మావోయిస్టులు మృతి
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- ఆయుధాలు స్వాదీనం చేసుకున్న బలగాలు
- కొనసాగుతున్న కాల్పులు
- ఛత్తీస్‌గఢ్‌లో విస్తృత కూంబింగ్

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో మరో సారి తుపాకుల మోత మోగింది. బస్తర్ డివిజన్‌లోని గంగలూర్ అటవీ ప్రాంతంలో చోటు చేసుకున్న ఈ ఘటనలో మొత్తం 11 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్‌ను జీజాపూర్ ఎస్‌పి జితేంద్ర కుమార్ ధృవీకరించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రకటన తర్వాత మావోయిస్టులపై ప్రభుత్వం యుద్ధం ముమ్మరం చేసింది. ఇప్పటికే పలువురు మావోయిస్టులను సిఆర్‌పిఎఫ్, కోబ్రా,డిఆర్‌జి బలగాలు ముట్టుపెడుతున్నాయి. గడిచిన పదిహేను రోజులుగా సుమారు 20 మందికిపైగా మావోయిస్టులు హతమయ్యారు. ఉదయం 10 గం. వరకు అందిన సమాచారం మేరకు నలుగురు మావోయిస్టులు మృతి చెందారని, సాయంత్రం అందిన సమాచారం మేరకు 11 మంది మృతి .చెందినట్లు తెలుస్తోంది. కాగా భద్రతాబలగాలు అడవిని జల్లెడ పడుతున్నాయని, చాలా మందికి గాయాల పాలయ్యారని మృతులు సంఖ్య పెరిగే అవకాశం ఉందనే వార్తలు అందుతున్నాయి. ఇప్పటి సంఘటనా ప్రదేశం వద్ద 11 మృత దేహాలతో పాటు ఎంజి ఆటోమెటిక్ తుపాకి, బిజిఎల్ లాంచర్, పలు తుపాకులతో పాటు మందుగుండు సామాగ్రిని తుపాకులను కూడా స్వాదీనం చేసుకున్నారు.

**కొనసాగుతున్న ఎదురు కాల్పులు ...**

బస్తర్ జిల్లా గంగలూర్ అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం పోలీసులు, మావోయిస్టుల నడుమ ఎదురు కాల్పులు మొదలయ్యాయి. ఈ కాల్పులు ఇంకా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. భద్రతా బలగాలు అడవిని మొత్తం జల్లెడపడుతున్నాయి. మావోయిస్టులపై ముప్పేట దాడి చేసేందుకు బస్తర్ డివిజన్ పరిధిలోని ఏడు జిల్లాలోని అటవీ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ ముమ్మరంగా సాగుతున్నాయి. మావోయిస్టు స్థావరాలపై పట్టు సాధించిన బలగాలు ఒక్కొక్కటికి మట్టుపెట్టుకుంటూ వస్తున్నాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అటవీ సరిహద్దుల్లోని గుట్టల్లో నలుగురు మావోయిస్టులను గత నెల్లో బలగాలు కాల్చి చంపాయి. అనంతరం మొన్నటికి మొన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆరుగురు మావోయిస్టులను హతమార్చారు.

మిగతా 2లో..

## సర్వే నెంబర్ 98 గుట్ట రిజిస్ట్రేషన్‌లో ఆ నలుగురే కీలకం..!



విచారణ చేస్తున్న తహసీల్దార్

2 లో

-గత బిఆర్ఎస్ పాలనలో గుట్ట రిజిస్ట్రేషన్
-కదులుతున్న రిజిస్ట్రేషన్ డొంక
-విచారణ ప్రారంభించిన రెవెన్యూ అధికారులు

## పెద్దపల్లిలో ఇసుకాసురుల మాయాజాలం

-కూలీల కడుపు కొడుతున్నారు
-బినామీలకు మద్దతుగా అధికారులు
-రికార్డులు, స్టాక్ బుక్స్‌కు తిలోదకాలు



2 లో

# బదిలీ ఉత్తర్వులు ఆపింది ఎవరు..?

**(మొదటిపేజీ తరువాయి)** ఏమి జరిగిందో ఎక్కడి ఉత్తర్వులు అక్కడ నిలిచిపోయాయి. వైరా సబ్ రిజిస్ట్రార్‌కు మద్దతుగా అధికారులపై ఒత్తిడి తెచ్చిన ప్రజాప్రతినిధి ఎవరన్నది ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశమైంది. నిన్న మొన్నటి వరకు వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధి రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి బదిలీ ఉత్తర్వులు నిలిపి వేయండని చెప్పడం వెనక దాగిన అంతరార్థం ఏమిటి. ఆ ప్రజాప్రతినిధి సిఫారసు పని చేసిందా లేక బంధుత్వంలో బదిలీ ఆగిందా అన్నది తేలాల్సి ఉంది. వైరా సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కరుణ 1/70 చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ పద్ధతుల్లో రిజిస్ట్రేషన్లు చేశారు. వైరా రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. పైసలు ముట్టచెబితే ఇక్కడ కాని పని లేదు. అంతగా ఈ కార్యాలయాన్ని భ్రష్టు పట్టించి ఎందరో గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసిన కార్యాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోకుండా ప్రజాప్రతినిధులు అడ్డుపడటం పలు అనుమానాలకు తావిస్తుంది. వైరా కార్యాలయాన్ని అడ్డాగా చేసుకుని కొంత మంది అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడ్డారు. కొణిజర్ల, వైరా, ఏన్కూరు మండలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లలో భారీ అవినీతి జరిగింది. ప్రజాపక్షం దినపత్రిక దీనిని ఆధారాలతో బహిర్గతం చేసింది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రాథమిక విచారణ చేశారు. వెంటనే అక్కడ అటెండర్‌గా పనిచేస్తున్న దుస్సా కృష్ణను భద్రాచలంకు బదిలీ చేశారు. సబ్ రిజిస్ట్రార్‌ను కూడా ఖమ్మం రిజిస్ట్రార్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగిని వైరా సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులు కూడా తయారు చేశారు. ఇప్పుడు రాజకీయ ఒత్తిళ్లతో రెండు రోజులుగా బదిలీ ఉత్తర్వులను అమలు చేయడం లేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తప్పుడు రిజిస్ట్రేషన్లు జరగడానికి అటెండరే కారణమని ఉన్నతాధికారులు భావిస్తున్నారా...? ఒకవేళ అటెండరే అక్రమ పద్ధతుల్లో రిజిస్ట్రేషన్లు చేస్తుంటే చూస్తుండిపోయిన రిజిస్ట్రార్ పైన చర్యలు తీసుకోరా అన్న విషయానికి ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. ప్రజాప్రతినిధులుగా ప్రజలకు ఇబ్బంది కలిగినప్పుడు స్పందించాల్సి ఉండగా ప్రజలకు ముఖ్యంగా గిరిజనులకు నష్టం చేసే పద్ధతుల్లో అక్రమాలకు పాల్పడిన సబ్ రిజిస్ట్రార్‌ను కాపాడే ప్రయత్నం వెనక మతలబు ఏమిటన్న ప్రశ్న ప్రజల నుంచి వినవస్తుంది. రాజకీయ పైరవీలకు తావుండరాదని, నిష్పక్షపాలన అంటూ ఇలా వ్యవహరించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా వైరా సబ్ రిజిస్ట్రార్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాజకీయ పార్టీలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని రాజకీయ పార్టీలు ఆధారాలతో సహా సబ్ రిజిస్ట్రార్ అవినీతిని ఉన్నతాధికారులకు తెలియజేసేందుకు సిద్ధమయ్యారు. సబ్ రిజిస్ట్రార్ బదిలీ నిలుపుదల వెనక రాజకీయ జోక్యం పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్లకు లొంగిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల తీరు పలు అనుమానాలకు తావిస్తుంది.

# పెద్దిపల్లిలో ఇసుకాసురుల మాయాజాలం

**ప్రజాపక్షం/ చర్ల :** ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్ చేస్తూ అధికారుల మద్దతుతో కొందరు బినామీ కాంట్రాక్టర్లు ఇష్టా రీతిలో వ్యవహరిస్తున్నారు. తమ మాయాజాలంతో అటు ప్రభుత్వాన్ని ఇటు గిరిజనులను మోసం చేస్తున్నారు. పెద్దిపల్లి ఇసుక ర్యాంపు అంటే ఇప్పుడు అక్రమాల పుట్టగా మారింది. బినామీ కాంట్రాక్టర్లకు అధికారుల తోడ్పాటే ఈ స్థితికి కారణమైందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ముఖ్యంగా ఇక్కడి గిరిజన కూలీల కడుపు కొడుతూ లక్షల రూపాయలను కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలు అగ్రిమెంట్ ప్రకారం గోదావరి నుండి ట్రాక్టర్లు లేదా ఎడ్ల బండ్ల ద్వారా డంపింగ్ యార్డుకు ఇసుకను తరలించాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా టిఎస్ ఎండిసితో చేసుకున్న ఒప్పందంలో స్పష్టంగా పేర్కొన్నారు. అయినా ఈ నిబంధనను గాలికి వదిలేశారు. పెద్దిపల్లి మహిళా ట్రైబల్ శాండ్ క్వారీ లేబర్ కాంట్రాక్ట్ మ్యూచువలి ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారితో టిఎస్ఎండిసి జనరల్ మేనేజర్ గతేడాది జూన్ రెండున ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం మూడు క్యూబిక్ మీటర్లకు మించకుండా ట్రాక్టర్ల ద్వారా కానీ ఎడ్లబండ్ల ద్వారా కానీ ఇసుకను గోదావరి గర్భం నుండి డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే లారీలకు మిషన్ ద్వారా ఇసుకను డంప్ చేయాల్సి ఉంటుంది. దీని వల్ల గిరిజన సొసైటీలోబ ఉన్న సభ్యులకు ఉపాధి దొరకడంతో పాటు ఆర్థికంగా లబ్ది పొందాలని ప్రభుత్వం నిబంధనలను రూపొందించింది. ఒక్కో క్యూబిక్ మీటర్‌కు రూ. 220 చొప్పున చెల్లించాల్సి ఉంది. అంతే కాకుండా ప్రతి రోజు ట్రాక్టర్లు లేదా ఎడ్ల బండ్ల ద్వారా తరలించినా వివరాలు స్టాకు రిజిస్ట్రార్‌లో నమోదు చేయాల్సి ఉంది. ప్రస్తుతం పెద్దిపల్లి ఇసుక డంపింగ్ యార్డుకు తరలించిన ఇసుకను పరిశీలిస్తే రూ. 75 లక్షలు ట్రాక్టర్ల యజమానులకు మరో రూ. 75 లక్షలు కూలీలకు చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. కానీ అధికారులు ఇటువంటి నిబంధనలు ఏమి పాటించడం లేదు. పెద్దిపల్లి ఇసుక ర్యాంపుకు సంబంధించి టిఎస్ఎండిసి వారికి రికార్డులు సమర్పించాల్సి ఉండగా అసలు ఇక్కడ రికార్డుల నిర్వహణ లేదు. పైగా ట్రాక్టర్ యజమానులకు బ్యాంకుల ద్వారా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ఇటువంటి ఏమి ఈ ఇసుక ర్యాంపు ద్వారా జరగడం లేదు. బినామీ కాంట్రాక్టర్లు దందాలు నిర్వహిస్తూ ప్రశ్నించిన వారిని బెదిరిస్తూ ఒక సామ్రాజ్యాన్ని తయారు చేసుకుని పెద్ద మొత్తంలో అక్రమ పద్ధతుల్లో ఇసుకను తరలిస్తున్నారు. గతేడాది సొంత లారీలు కలిగిన కొందరిని కలుపుకుని ఎటువంటి అనుమతులు లేకుండానే ఇసుక దందా నిర్వహించిన సంగతి అందరికీ తెలిసిందే. ప్రభుత్వ నిబంధనలను తోసిపుచ్చి జరుగుతున్న ఈ అక్రమ ఇసుక తరలింపుపై పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అక్రమార్కులకు మద్దతుగా నిలిచిన అధికారుల తీరు, బినామీ కాంట్రాక్టర్ల బాగోతం బయట పడుతుంది. గిరిజనులకు అన్యాయం చేస్తున్న అధికారులపై, బినామీ కాంట్రాక్టర్లపై తగు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

# చట్టసభలో ఏకైక ప్రజా గొంతుక సిపిఐ

**(మొదటిపేజీ తరువాయి)**

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు ప్రజలకు మరో సారి హామీ ఇచ్చారు. మౌలిక అవసరాలైన రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, సిపిఐ మండల కార్యదర్శి వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, పట్టణ కార్యదర్శి అడుసుమెల్లి సాయిబాబా, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, డి.సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శేనగరపు శ్రీనివాసరావు, మన్నెం వెంకన్న, వేములపల్లి శ్రీను, జకరయ్య, ఎస్‌కె పాషా, సురేష్, నాగేశ్వరరావు, భూక్యా విజయ్, వేములపల్లి రాజశేఖర్, సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు కొండా వెంకన్న, బీ.వీ రావు, ఆవుల మధు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సమావేశంలో బిఆర్ఎస్ ఎంఎల్ఎ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆయన కండువా కప్పుకో లేదు కానీ ఆ పార్టీ సమావేశాలకు హాజరవుతూ అందరిని ఆశ్చర్యపరుస్తున్నారు. ఒకవేళ పార్టీ మారితే దానం నాగేందర్, కడియం శ్రీహరిలా తన పైన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తుందనుకున్నాడో లేక మరెమిటో కానీ సైలెంట్‌గా కాంగ్రెస్ సమావేశాలకు హాజరవుతున్నాడు. మంగళవారం ఇల్లందులో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి బిఆర్ఎస్ ఎంఎల్ఎ హాజరు కావడం విస్తృత చర్చకు దారి తీసింది. గతేడాది జరిగిన శాసన సభ ఎన్నికల్లో భద్రాచలం నుంచి బిఆర్ఎస్ అభ్యర్థి గా పోటీ చేసిన తెల్లం వెంకట్రావు సమీప కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్యపై విజయం సాధించాడు. వెంకట్రావు ఆది నుంచి ప్రస్తుత రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరునిగా ఉన్నారు. తెల్లం వెంకట్రావు గెలిచిన నాటి నుంచి కాంగ్రెస్‌లో చేరతాడనే ప్రచారం జరిగింది. ఇటీవల రేవంత్‌రెడ్డి భద్రాచలం పర్యటనలో కూడా వెంకట్రావు కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి పని చేశారు. మంగళవారం ఇల్లందులో జరిగిన సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరు కాగా ఈ సమావేశంలో కాంగ్రెస్ శాసన సభ్యుడు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య తో పాటు తెల్లం వెంకట్రావు కూడా హాజరయ్యాడు. రాష్ట్రంలో బిఆర్ఎస్‌ను వీడిన ఎంఎల్ఎలలో తెల్లం వెంకట్రావు మూడో వారు. కాంగ్రెస్‌లో చేరడం కానీ, ఆ పార్టీ కండువా కానీ లేకుండానే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొనడం గమనార్హం. మరీ ఇప్పుడు తెల్లం వెంకట్రావు బిఆర్ఎస్సా, కాంగ్రెస్సా తేల్చుకోవాల్సి ఉంది.

# ఛత్తీస్‌గడ్‌లో భారీ ఎన్ కౌంటర్

**(మొదటిపేజీ తరువాయి)** తాజాగా 11 మంది మృతి చెందారు.

**వరుస ఎదురుదెబ్బ ...**

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత భద్రతా బలగాలు మావోయిస్టులపై ముప్పేట దాడి చేస్తున్నాయి. ఈ దాడుల్లో మావోయిస్టు పార్టీకి పెద్ద ఎత్తున నష్టంవాటిల్లుతోంది. హిడ్మా స్వగ్రామమైన పూంవర్తిలో పాగా వేసిన సిఆర్‌పిఎఫ్, డిఆర్‌జి, కోబ్రా బలగాలు పై చేయి సాధిస్తున్నాయి. పక్కా సమాచారాన్ని సేకరిస్తున్న వారు గురిచూసి కొడుతున్నారు. ఇదిలా ఉండగా గడిచిన పదిహేను రోజులుగా మావోయిస్టులు పోస్టర్లు విడుదల చేస్తున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లు ఆపాలని, ఎన్నికలను బహిష్కరించాలని, అడవుల నుండి ఆదివాసీలను దూరం చేస్తూ విలువైన సంపదన బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వాలు యోచిస్తున్నాయని ఆ కరపత్రాల్లో మావోయిస్టులు పేర్కొంటున్నారు. మరో ప్రక్క ఛత్తీస్‌ఢ్ ప్రభుత్వం షరతులతో కూడిన చర్చలకు సిద్ధమని మావోయిస్టు ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రికి లేఖ రాసిన తర్వాత పెద్ద ఎత్తున ఎన్‌కౌంటర్‌లు చోటు చోసుకోవడం గమనార్హం.

## సర్వే నెంబర్ 98

# గుట్ట రిజిస్ట్రేషన్‌లో ఆ నలుగురే కీలకం..!






**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో సర్వే నెంబర్ 98లో ఉన్న ప్రభుత్వ గుట్ట రిజిస్ట్రేషన్‌లో నలుగురు సూత్రధారులు. అందులో ఇద్దరు అధికారులు ఉండటం విశేషం. ఎవరికి ఎలాంటి అనుమానాలు లేకుండా రాకుండా రెండు శాఖల అధికారులతో ఇద్దరు వ్యక్తులు పలుసార్లు చర్చలు జరిపిన అనంతరం అక్రమ రిజిస్ట్రేషన్‌కు తెరలేపారు. 275.55 గజాలుగా ఉన్న ఇంటి స్థలాన్ని 709.55 గజాలుగా రిజిస్ట్రేషన్ చేశారు. పలుసార్లు ప్రజాపక్షం కథనంలో ప్రభుత్వ గుట్ట అక్రమ రిజిస్ట్రేషన్‌పై వస్తున్న కథనాలకు స్పందించిన అధికార యంత్రాంగం రెవెన్యూ అధికారులు విచారణ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రభుత్వ భూములు ఆక్రమణపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పాలనలో జరిగిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ అధికారులు విచారణ ప్రారంభించారు. వైరా తహశీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ మెచ్చా వెంకటేశ్వరరావు సర్వేయర్‌తో, రెవెన్యూ సిబ్బందితో కలిసి గుట్ట తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రాంతానికి వెళ్లి విచారణ ప్రారంభించారు. ఈ విచారణలో మీ వద్ద ఉన్న డాక్యుమెంట్లు తీసుకొని రావాలని పలుసార్లు ఆదేశించారు. కాని 275.55గజాలు ఉన్న డాక్యుమెంట్లను అధికారులకు ఇవ్వకుండా కేవలం 709.55 గజాలు ఉన్న డాక్యుమెంట్‌ని అధికారులకు చూపించారు. దీంతో తహశీల్దార్ శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేస్తూ 709.55 గజాలు ఎలా రిజిస్ట్రేషన్ అయింది. దీనికి సంబంధించి ముందు ఉన్న డాక్యుమెంట్ ఎందుకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు మీ వద్ద ఉన్న డాక్యుమెంట్లు వెంటనే తీసుకొని తహశీల్దార్ కార్యాలయానికి రావాలని ఆదేశించినప్పటికీ డాక్యుమెంట్లను తీసుకొని నేటికి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులు అక్కడికి వెళ్లలేదు. అసలు విషయం ఏమిటంటే అప్పటి సబ్ రిజిస్ట్రార్ కమీషనర్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు ఈ రిజిస్ట్రేషన్ చేయడంలో కీలకపాత్ర పోసించారు. ఏమి జరిగిందో ఏమిటో కాని ఆ ఇద్దరు వ్యక్తులే ఇద్దరు అధికారులతో కోట్ల రూపాయల ప్రభుత్వ గుట్టను రిజిస్ట్రేషన్ చేయడంలో కీలకపాత్ర వహించారు. అధికారులు విచారణ జరిపి వాస్తవాలను బయటకు తీస్తే రిజిస్ట్రేషన్ చేసిన అధికారులు చేయించిన వ్యక్తులు ఎవరు అనేది తెలుస్తుంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఆక్రమణ జరిగిందని ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ భూములు ఆక్రమణపై ఉక్కుపాదం మోపింది. దీంతో అక్రమదారుల గుండెల్లో గుబులు ప్రారంభమవుతుంది. ఇప్పటికే రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలుసార్లు ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడిన దేవాలయ భూములు ఆక్రమించుకున్న సహించేది లేదని అధికార యంత్రాంగం ఎక్కడ నిర్లక్ష్యం చేయవద్దని ఆదేశించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఏది ఏమైనా వైరాలో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ గుట్టను రిజిస్ట్రేషన్‌లో కీలకపాత్ర పోషించిన వారిపై అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచిచూడాలి.

## ఘనంగా తూము ప్రకాశ్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/బోనకల్‌:** మండల కేంద్రంలోని శాంతి నిలయంలోని మానసిక వికలాంగుల వద్ద సీపిఐ సీనియర్ నాయకులు, అమరజీవి తూము ప్రకాశ్ రావు మనవడు తూము ప్రకాశ్ జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగులతో కేక్ కట్ చేయించి వేడుకలను చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్ మాట్లాడుతూ..పుట్టుకతో బుద్ధిమాంద్యంతో పుట్టి ఎదుగుదలలేని అభం శుభం తెలియని ఆ పిల్లలే మానసిక వికలాంగులని, ప్రస్తుత పరిస్థితులలో వారిని ఇంట్లో అన్నం పెట్టే తల్లిదండ్రులే విసుక్కుంటారన్నారు. అలాంటి వారిని అక్కున చేర్చుకొని, శాంతి నిలయాన్ని స్థాపించి, గత 25 ఏళ్లుగా మానసిక వికలాంగులకు కొండంత అండగా నిలుస్తూ సేవలందిస్తున్న సిస్టర్ అల్పీని అభినందించారు. సమాజంలో తమ వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహించే సదృశ్యంతో ప్రకాశ్ జన్మదిన వేడుకలను శాంతి నిలయంలో నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, యంగల గిరి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆరోగ్యంగా ఉండాలి



**ప్రజాపక్షం/పినపాక:** మహిళలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఆరోగ్య మహిళా కార్యక్రమం అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలలో నిర్వహిస్తున్నామని ఎంసిహెచ్ పిఓ డాక్టర్ చైతన్య తెలిపారు. మంగళవారం పినపాక మండల పరిధిలో గల జానంపేట, పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చెకింగ్ లు, సాధారణ డెలివరీలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ క్లినికుల ద్వారా మహిళలకు బీపీ, షుగర్‌తోపాటు క్యాన్సర్ పరీక్షలు కూడా నిర్వహిస్తారన్నారు. ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, అక్కడే మందులు అందిస్తారని, 8 ప్యాకేజీల్లో 57 రకాల టెస్టులు అందుబాటులో ఉంటాయన్నారు.. ప్రాథమిక టెస్టులతోపాటు పోషకాల లోపం, సంతానలేమి, మెనోపాజ్, ఎస్టీడీ, పీసీవోడీ, ఐవీ తదితర సమస్యలకు చికిత్సలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ దుర్గాభవాని, జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ శృతి, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

## బిటెక్ ఫలితాల్లో విజయ కళాశాల విద్యార్థుల ప్రభంజనం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిధిలోని తనికెళ్ల సమీపంలోగల అమ్మపాలెం పంచాయతీ పరిధిలోని విజయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బిటెక్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. కళాశాల విద్యార్థినిలు మ్రి దివ్య 92.44 శాతంతో కళాశాల టాపర్‌గా నిలిచారు. రేగడ అశ్విని 87 శాతం , లక్ష్మీ ప్రియాంక 85 శాతం , పి భూమిక 84.8 శాతం అత్యధిక మార్కులు సాధించి యూనివర్సిటీ పరిధిలో ర్యాంకుల పంట పండించారు. అంతే కాకుండా జిల్లాలో ఎక్కువ ఉత్తీర్ణత శాతాన్ని సాధించిన కళాశాలకు గర్వకారణంగా నిలిచారు. కళాశాల వైస్ చైర్‌పర్సన్ పారుపల్లి విజయలక్ష్మి విద్యార్థినులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్‌బాబు , వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నయ్య, ఎకడమిక్ డీన్ శ్రీనివాసరావు , వివిధ విభాగాల అధిపతులు విద్యార్థిని , విద్యార్థులను అభినందించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కిరణ్



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం జిల్లా యువజ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా..ఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల గ్రామానికి చెందిన బానోత్ కిరణ్ నియమితులయ్యారు. మంగళవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలోని సంజీవరెడ్డి భవన్‌లో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు యడ్లపల్లి సంతోష్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కిరణ్ మాట్లాడారు...నాపై నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యత తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు.గత తొమ్మిది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో యువత నిరాదారణ గురయ్యిందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో యువతకు మేలు చేసే విధంగా తమ కార్యచరణ ఉంబోతుందన్నారు. ఈ సందర్భంగా కిరణ్‌ను కాంగ్రెస్ నాయకులు,యువజన కాంగ్రెస్ సభ్యులు, శ్రేయోభిలాషులు, మిత్రులు అభినందించారు.

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

**-ఓటు హక్కు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి**
**-5కె రన్‌ను ప్రారంభించిన కలెక్టర్ గౌతమ్**







**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో మంగళవారం ఉదయం 'ఐ ఓట్ ఫర్ షుర్ ' అనే నినాదంతో 5కె రన్ నిర్వహించారు. సర్దార్ పటేల్ మైదానంలో 5కె రన్‌ను జిల్లా కలెక్టర్ విపి గౌతమ్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్‌సురభి, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్ నాయక్ లు జెండా ఊపి ప్రారంభించారు. ఐ ఓట్ ఫర్ షుర్ అనే నినాదాలు రాసిన ప్లేకార్డులను ప్రదర్శిస్తూ సర్దార్ పటేల్ మైదానం నుంచి లకారం ట్యాంక్ బండ్ వరకు రన్ నిర్వహించారు. రన్‌లో ప్రతిభ కనబర్చిన నలుగురికి జిల్లా కలెక్టర్ నగదు బహుకరించారు. అనంతరం ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5కె రన్‌లో 1000 మంది యువత పాల్గొన్నారని వీరంతా తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటరు నమోదుకు ఏప్రిల్ 14 చివరి తేదీ అని తెలిపారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు పోలింగ్ కేంద్రానికి వెళ్లి మే 13న తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలన్నారు. సి విజిల్ యాప్ గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రాజకీయ నాయకులు ప్రలోభాలకు గురి చేస్తే ఒక ఫోటో తీసి పంపిస్తే అధికార బృందం వెంటనే అక్కడకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకుంటుందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్‌సురభి మాట్లాడుతూ ఓటరు హెల్ప్ లైన్ యాప్ ద్వారా ఓటు హక్కు ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చునని, సి విజిల్ యాప్ ద్వారా అవినీతి, అక్రమాలను అరికట్టవచ్చునని తెలిపారు. 5కె రన్‌లో వివిధ శాఖల అధికారులతో పాటు గిరిజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, వివిధ వర్గాల వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా ఉపాధి కల్పనా అధికారి కె. శ్రీరాం, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, వివిధ వర్గాల ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యం వల్లే చంద్రాయపాలెం ఘటన





**ప్రజాపక్షం/సత్తుపల్లి రూరల్:** చంద్రాయపాలెం భూ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వ వైఫల్యం వల్లే పోలీసులపై దాడి ఘటన జరిగిందని సీ.పీ.ఐ. (ఎం.ఎల్ ) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. అనుకోని సంఘటనను సాకుగా తీసుకొని గ్రామాల్లో పోలీసులు దౌర్జన్యం చేసి ఆదివాసీలను చిత్రహింసలకు గురి చేసి జైళ్ళల్లో నిర్బంధించడం అన్యాయం అన్నారు. మంగళవారం సత్తుపల్లి లోని నీలం రామచంద్రయ్య భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసులపై దాడి ఘటన ఏకపక్షంగా జరగలేదన్నారు సత్తుపల్లి సీ.ఐ ఓ గిరిజన యువకుని వద్ద ఉన్న సెల్ ఫోన్ ని లాక్కొని గల్లా పట్టుకొని అరెస్ట్ చేసే ప్రయత్నం చేయడం వల్లనే జరిగిందన్నారు. పోలీసుల ప్రవర్తన పట్ల అనుమానం వచ్చిందన్నారు. దీంతో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించారనే అనుమానం తమకు కలగడం వల్లే దాడికి ప్రయత్నం చేసినట్లు గిరిజనులు తమకు వెల్లడి చేశారని ఆయన పేర్కొన్నారు ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు గంట శ్రీనివాసరావు, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి శరత్, డివిజన్ నాయకులు కోర్స వెంకటేష్, మండల నాయకులు నడికుదురు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎండిపోతున్న మొక్క జొన్న..!

**-తలలు పట్టుకుంటున్న రైతులు**
**-ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు**



**ప్రజాపక్షం/సుజాతనగర్:** మండలంలోని జొన్న పంట రైతులు నీరు లేక పంటలు ఎండిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అందిన కాడికి అప్పులు తెచ్చి పంటలు వేస్తే పంటలు సరైన దిగుబడి రాక ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుజాతనగర్ మండలంలోని మరితండ గ్రామానికి చెందిన భూక్య ఈరు తనకున్న రెండు ఎకరాలలో జొన్న పంటను సాగు చేస్తున్నాడు. పంట వేసినప్పటి నుంచి లద్దె పురుగు, చీడ పీడలతో రకరకాల మందులు పిచికారి చేసి పంటను కాపాడుకుంటూ వచ్చాడు. పంట పొట్ట దశకు వచ్చింది ఎండలు రోజు రోజుకు పెరిగిపోతూ ఉండడంతో నీరు లేక పంట ఎండిపోతుంది. 200 అడుగుల లోతులో బోరు వేస్తే ఒక్క చుక్క నీరు రాక పంట ఎండిపోవడంతో రైతు తలలు పట్టుకుంటున్నారు. ఆ గ్రామాలలో భూగర్భ జలాలు వాగులలో నీరు అడుగంటడంతో యాసంగి పంట పొలాలు బోరు బావులు పైనే ఆధారపడి వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్నారు. జొన్న, మొక్కజొన్న పంటలు పొట్ట దశ రావడంతో గింజ ఏర్పడే దశకు బోర్లలో నీళ్లు అడుగంటడంతో దిక్కుతోచని పరిస్థితులు ఉన్నారు. సుజాత నగర్ మండలంలో చాలా గ్రామాల్లో ఇదే దుస్థితి నెలకొంది. ఈ సంవత్సరం మిర్చి రైతులు ఎకరానికి రెండు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తే మిర్చి నారు నాటినప్పటి నుంచి ఎర్ర నల్లి, గుబ్బ రోగం, ముడత చీడ పీడలతో సోకడంతో అనేక కంపెనీల మందులు పిచికారి చేయవలసి వచ్చింది. ఏమాత్రం ప్రయోజనం రాకపోవడంతో చాలామంది రైతులు మిర్చి తోటలను పీకారు. దీనివలన ఎకరానికి పెట్టిన పెట్టుబడి లక్షన్నర వరకు నష్టం జరిగింది. జరిగిన నష్టాన్ని భరించలేక అదే స్థానంలో జొన్న పంట లు సాగు చేస్తే బోరు బావుల్లో నీరు లేక మళ్ళీ వేల రూపాయల నష్టం జరుగుతుంది. ఇలా ప్రతి ఏడాది జరుగుతూ ఉంటే రైతులు అప్పుల్లో ఊబిలో కూరుకు పోతున్నారు. రైతులు తమ పంటల నీటి కోసం ఐటిడిఏ ద్వారా తమ పంట పొలాల కోసం బోర్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్న ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు జరిగిన నష్టానికి పరిహారం అందించి కాపాడాలని సుజాతనగర్ మండల రైతులు కోరుతున్నారు.

# మండుటెండల్లో 'ఉపాధి' పనులు..!

**-సేద తీరేందుకు నిలువనీడ కరువాయే..**
**-అరకొర వసతులతో ఇక్కట్లు**
**-సౌకర్యాలు కల్పించాలని వేడుకోలు**



**ప్రజాపక్షం/కరకగూడెం:** ఎండలు మండుతున్నాయి, అయినా ఉపాధి హామీ పనులు చేపట్లే ప్రాంతాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కనిపించడం లేదు. మండల కేంద్రంలోని ఉపాధి పనులు చేపట్టే ప్రాంతాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కనిపించడం లేదు. ప్రాథమిక చికిత్సకు కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కష్టానికి చెల్లించే భత్యం ఇదేమీ లేకపోవడంతో కూలీలు ఆవేదన చెందుతున్నారు. ఉపాధి హామీ కూలీలకు ఎనిమిది వారాలు అయిన ఉపాధి హామీ డబ్బులు రాకపోవడంలో ఆవేదన చెందుతున్నారు. ..మండలంలో ఉన్న కుటుంబాలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద లబ్ధి పొందుతున్నాయి. వందల మంది ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. ఉపాధి హామీ కూలీలకు ఉపాధి హామీ చెట్ల నీడ దిక్కు లేని పరిస్థితి. కూలీలకు పని ప్రదేశంలో ఎండ నుంచి ఉపశమనం పొందడానికి మంచినీళ్ల వేడికాకుండా షామియానాలు లేదా పట్టాలు ఏర్పాటు చేయాలి. నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం నుంచి నీద పట్టాలు రావట్లేదు. కూలీలు గత్యంతరం లేక కాసేపైన పేద తీరేందుకు సమీప చెట్లను ఆశ్రయిస్తున్నారు. అవి కూడా లేని చోట కండువాలు కప్పుకుంటున్నారు. సద్దులు చిన్నపిల్లలు తల్లిదండ్రులు నేకట్టుకోలేక అవస్థలు పడుతున్నారు. పిల్లల్ని వెంట తీసుకెళిన వారి పరిస్థితి మరీ దయనీయం. గాయాలతో పరుగులు. ప్రాంతంలో ఎవరికైనా గాయమైతే ప్రధను చికిత్స కోసం స్థానిక పీహెచ్సీలకు వెళ్లాలి. వస్తుంది అవి లేని చోట స్థానిక ఆర్ ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. గరియాది సుమారు ఇద్దరు, ముగ్గురు గాయపడ్డారు. వీళ్లకు కనీసం నష్టపరిహారం కూడా ఇవ్వట్లేదు అని ఆవేదన 2010 నుంచి ఫస్ట్ ఎయిడ్ కిట్లు సరఫరా ఆగిపోయింది. ఉపాధి హామీ కూలీలకు కానరాని నీరు ప్రభుత్వం ఈజీఎస్ రపాధి హామీ కూలీల పని ప్రదేశంలో నీటి సౌకర్యం కన్పించాలని కలెక్టర్ చెబుతున్న ఈజీఎస్ సిబ్బంది ఆదేశాల సారంగా ప్రతి బుధవారం టివి మీటింగ్లో ఉపాధి హామీ కూలీలకు వాటర్ సౌకర్యం కల్పించాలని అంటున్నారు. కానీ వారి మాటలు మమాలు మూటలుగానే మిగిలిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈజీఎస్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకొని వాటర్ కల్పించాలని ఉపాధి హామీ కూలీలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

**ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు**





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి హాస్పిటల్ లో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు, పేషంట్ కేర్ , సెక్యూరిటీ సిబ్బందికి జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏరియా హాస్పిటల్ ను ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీ నారాయణతో కలిసి ఆయన సందర్శించారు . ఈ సందర్భంగా ఆయన పారిశుద్ధ కార్మికులతో మాట్లాడారు. నెలకు 12 వేల రూపాయలు చెల్లించాల్సి ఉన్న కేవలం 10,500 వేల రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నట్లు ఆయన దృష్టికి వచ్చిందని ఆ తెలిపారు. జీతం కూడా 6 నెలల నుండి కాంట్రాక్టర్ చెల్లించడం లేదని తేలిందన్నారు. వాస్తవానికి రాష్ట్రంలోని ఏ ఏరియా హాస్పిటల్ లో పనిచేసే పారిశుద్ధ కార్మికుల కైనా 15 వేల రూపాయల వేతనం ఇవ్వాలని అందులో పీఎఫ్ ఈఎస్ఐ కటింగ్స్ రూ. 3,000 పోగా మిగిలిన రూ. 12,090 రూపాయలు జీతాన్ని చేతికి ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ కాంట్రాక్టర్ చేతివాటం చూపించి సత్తుపల్లి లో పనిచేసే పారిశుద్ధ కార్మికులకు రూ. 10,500 ఇవ్వటం బాధాకరం అన్నారు. త్వరలో వీరి సమస్యలపై ఏఐటియుసి ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించినట్లు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. పారిశుద్ధ్య కార్మికుల జీతం చాలా తక్కువగా ఉంటుందని వాస్తవానికి కాంట్రాక్ట్ అండ్ ఎబాల్షన్ యాక్ట్ 1970 ప్రకారం రెగ్యులర్ ఉద్యోగుల శాలరీలో బేసిక్ ను కాంట్రాక్టు ఎంప్లాయిస్ కు అన్వయించాలని కానీ ఇక్కడ ఇష్టారీతిన జీతాన్ని నిర్ణయించడం జరిగిందన్నారు. గత రెండు సంవత్సరాల నుండి పిఎఫ్ డబ్బులు కూడా చెల్లించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే మేల్కొని వీరికి పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యంతో పాటు రావలసిన జీతాన్ని కూడా వెంటనే మంజూరు చేయించాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షు నిమ్మటూరి రామకృష్ణ , జిల్లా సమితి సభ్యులు తడికమల్ల యోబు, దామాల దయాకర్, వర్కర్లు యశోద, శ్రీనివాస్, రవి, కుమారి, మరియమ్మ, వెంకటరమణ, పద్మ , కాశీం బి , కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సులభ రీతిలో లెక్కలు బోధించాలి

**- ఐటిడిఏ పిఓ జైన్**

**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన విద్యార్థులు లెక్కలంటే భయపడి పారిపోకుండా సులుభరీతిలో బోధించి పరీక్షల్లో పాసయ్యే విధంగా చూడాలని వేదిక మాథ్స్ ఉపాధ్యాయులకు ఐటిడిఏ పిఓ ప్రతీక్ జైన్ సూచించారు. మంగళవారం ఐటిడి ఏ సమావేశ మందిరంలో వేదిక గణితం బోధిస్తున్న ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ 6,7,8,9 తరగతులు చదివే గిరిజన విద్యార్థులకు సులభ తరమైన పద్ధతిలో అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. కూడికలు, తీసివేతలు, గుణకారాలపై సులభంగా బోధించడమే కాకుండా ఎక్కాల నేర్చుకునేలా చూడాలన్నారు. ప్రస్తుతం వెనుకబడి ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారికి లెక్కలంటే భయం లేకుండా చూడాలన్నారు. అనంతరం వేదిక డైరెక్టర్ మురహరి మాట్లాడుతూ గత ఏడాది సుమారు 12000 మంది విద్యార్థులకు వేదిక ఉపాధ్యాయులు లెక్కలు బోధించారని, చాలా మంది విద్యార్థుల్లో భయం పోయిందని తెలిపారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా అంతా పరీక్షలు బాగా రాశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, డిడి మణెమ్మ తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గిరిజన రైతాంగానికి నీటి సదుపాయం

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఏజెన్సీ ఏరియాలో వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజన రైతాంగానికి సాగునీటి వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా శిక్షణా కలెక్టర్‌లు యువరాజ్ మరమ్మట్, మయాంక్ సింగ్, యూనిట్ ఆఫీసర్లతో కలిసి భారత్ రూరల్ లెవల్ ఫుడ్ ఫౌండేషన్ ఢిల్లీ వారు గిరిజన రైతులు అభివృద్ధిలోకి రావడానికి నిర్వహించిన వీడియోలను తిలకించారు. అనంతరం భారత్ రూరల్ లెవల్ ఫుడ్ ఫౌండేషన్ సిఇఓ మాట్లాడుతూ గిరిజన రైతుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు స్థిరమైన వ్యవసాయ భాగస్వామ్యం సాధించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని అన్నారు. ప్రత్యేకంగా ఐదు గిరిజన గ్రామాలను ఎంపిక చేసుకుని పూర్తి సర్వే చేసి రైతులకు భవిష్యత్‌లో నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు కృషి చేస్తామని, ఇందుకు ఐటిడిఏ అధికారుల సహకారం కావాలన్నారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ గిరి వికాసం ద్వారా గిరిజన గ్రామాల్లో 750 బోర్లు సబ్సిడితో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గిరిజనుల వ్యవసాయాభివృద్ధి కోసం కృషి చేయడం అభినందనీయమని, ఐటిడిఏ సహాయసహకారాలు ఉంటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజు, వ్యవసాయాధికారి భాస్కరన్, వివిధ శాఖల యూనిట్ల అధికారులు పాల్గొన్నారు.

## కార్మిక నాయకునికి సంస్కరణ సభ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఐటిసి పిఎస్‌పిడి యూనిట్ భద్రాచలం నందు టిఎన్‌టియూసి స్థాపించడంలో కీలకపాత్ర పోషిం చి తదుపరి జరిగిన గుర్తింపు సం ఘ ఎన్నికల్లో టిఎన్‌టియూసి విజయానికి తోడ్పడటంతో పాటు నాడు జరిగిన వేతన ఒప్పందంలో కార్మిక వేతన సంక్షేమంలో తిరుగులేని పెరుగుదలను సాధించిన తాళ్లూరి అప్పారావు ఇటీవల మరణించారు. వారికి ఐటిసి పిఎస్‌పిడి యూనిట్ భద్రాచలం నందు గుర్తింపు సంఘగా ఉన్న టిఎన్‌టియూసి ఆధ్వర్యంలో సంస్కరణ సభ నిర్వహించారు. ఈసభలో తాళ్లూరి అప్పారావుతో పని చేసిన కార్మిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ తాళ్లూరి అప్పారావు ఆదర్శవంతమైన కార్మిక నాయకుడిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాడు అప్పారావుతో పని చేసిన పాకాల పాటి దుర్గాప్రసాద్, ఏఐటియూసి సత్యనారాయణ, కేవిఆర్, గల్లా నాగభూషయ్య, ఐటిసి టిఎన్‌టియూసి గుర్తింపు సంఘం అధ్యక్షులు కనకమేడల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి గాదే రామకోటిరెడ్డి, టిఎన్‌టియూసి ఎక్జిక్యూటివ్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద మందు పార్టీ

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు గ్రామ శివారులో ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ, ఆంధ్రా సరిహద్దులో అంతరాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద రాత్రులు మందు పార్టీలు నిర్వహిస్తున్నారు. ఈ సరిహద్దు చెక్ పోస్ట్ మీదుగా అక్రమార్కులు ఇసుక, గ్రావెల్ అక్రమంగా తరలిస్తుంటారు. ఈ క్రమంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఆ అక్రమార్కులు మందు పార్టీ ఏర్పాటు చేశారు. అది కాస్తా మంగళవారం వెలుగులోకి వచ్చింది. చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ రాత్రి పూట మందు తాగుతూ కనిపించారు. అది గమనించిన స్థానికులు వీడియో తీస్తుండగా వారి సెల్ ఫోన్ లాక్కోవడానికి ప్రయత్నించారు. మద్యం తరలిపోకుండా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద ఇలా మందు పార్టీ చేసుకోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పేదరికాన్ని జయంచి పోలీస్ కొలువు సాధించిన యువకుడు



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** ఉద్యోగానికి పేదరికం అడ్డం కాదు అని రాజపురం గ్రామానికి చెందిన యువకుడు బొల్లోజు వెంకటేశ్వరరావు నిరూపించారు. పుట్టడమే పేదరికంలో పుట్టి ఆరు సంవత్సరాల వయస్సులోనే తల్లిని కోల్పోయి అమ్మమ దగ్గర పెరుగుతూ ప్రభుత్వ పాఠశాల్లో ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న సమయంలో అమ్మమను కూడా కోల్పోయి మేనమామ అండగా వుండి అనుకున్న సమయంలో కొన్ని నెలల్లోనే మేనమామను కోల్పోయి ఎన్నో అటుపోట్లు ఎదుర్కొని పట్టుబట్టిన విక్రమార్కుడిలా పోలీస్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకొని ఉద్యోగం కచ్చితంగా వస్తుందని అనుకున్న సమయంలో కోర్టు ఉత్తర్వులు రావడంతో కొన్ని రోజులు తాత్కాలికంగా వాయిదా పడి మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో ఓపెన్ క్యాటగిరలో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. చిన్ననాటి నుంచి ఎన్నో కష్టాలు ఎదుర్కొని బ్రతుకుదేరువు కోసం హైదరాబాద్ వెళ్లి కార్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తూ ఎలాగైన ఉద్యోగం సాధించాలని కష్టపడి పోలీస్ ఉద్యోగం సాధించి అందరికి ఆదర్శంగా నిలిచారు. ఉద్యోగం సాధించిన వెంకటేశ్వరరావుని పలువురు గ్రామ ప్రజలు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

## స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలో రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఆదేశాలనుసారంగా ఎంపిడివో మహాలక్ష్మి ఆధ్వర్యంలో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ కూడా మీ యొక్క ఓటును స్వేచ్ఛగా ఎటువంటి ప్రలోభాలకు లోబడకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువత ఓటు హక్కు కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఎంపిడివో కార్యాలయం నుండి అన్నపురెడ్డిపల్లి అంబేద్కర్ ప్రధాన కూడలి వరకు ప్లే కార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీని నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో ఏపివో రామ్ భద్రయ్య, పంచాయితీ కార్యదర్శి ఖాదర్మీయా, సెర్ఫ్ సీసీలు జ్యోతి, శ్రావణి, వివోఏలు, గ్రామ పంచాయితీ కార్యాలయ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఈవిఎంలపై కనీస అవగాహన కలిగి ఉండాలి

**- జిల్లా ఎన్నికల అధికారి డా.ప్రియాంక ఆలా**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఈవిఎంలపై ఎన్నికల సిబ్బంది కనీస అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డా.ప్రియాంక ఆలా అన్నారు. మంగళవారం పాల్వంచ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. విధులు నిర్వహించే సిబ్బంది ఫారం 12, ఫారం 12 ఏలను శిక్షణ నిర్వహించే కేంద్రాల్లో అందజేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది అదే నియోజకవర్గంలో విధులు కేటాయిస్తే వారు ఈడిని తీసుకోవడం ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫారం 12 ఏలను అందజేయాలని చెప్పారు. ఓటు ఉన్న పార్లమెంట్ ఉన్న నియోజకవర్గం కాకుండా మరొక నియోజకవర్గంలో విధులు కేటాయిస్తే అటువంటి వారు పోస్టల్ బ్యాలెంట్ వినియోగించుకోవచ్చున్నారు. పోలింగ్ కేంద్రంలో నమోదైన ఓట్ల వివరాలను ప్రిసైడింగ్ అధికారులు17 సి ద్వారా, రిజిష్టర్ ఆఫ్ ఓటర్ వివరాలు 17 ఏ ద్వారా అందజేయాలని సూచించారు. శిక్షణా తరగతులకు గైర్హాజరైన వారికి ఎన్నికల నిబంధనల ప్రకారం షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ దామోదర్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ, భద్రాచలం తహశిల్దార్ శ్రీనివాసరావు, పాల్వంచ తహశిల్దార్ వివేక్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య పాల్గొన్నారు.

# పున్నాగపూలు పుస్తకావిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పున్నాగపూలు పుస్తకాన్ని జిల్లా విద్యా శాఖాధికారి సోమశేఖర శర్మ ఆవిష్కరించారు. బాల సాహిత్య వేదిక కన్వీనర్ కోండ్రు బ్రహ్మం సంపాదకత్వంలో ఎన్ఎస్‌సి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలబాలికల చే వ్రాయబడిన కథల సంకలనం పున్నాగ పూలు పుస్తకాన్ని మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శంకర్‌రావు అధ్యక్షతన జరిగిన సభలో డిఈవో సోమశేఖర శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఈవో మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న సృజనను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఖమ్మంజిల్లాలో ఇటీవల ఈ కృషి విస్తృతంగా జరుగుతుందన్నారు. పుస్తక సంపాదకులు కొండ్రు బ్రహ్మం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్‌రావు, దాతలు పునాటి వెంకటేశ్వర్లు, నారాయణరావు లను ఈ సందర్భంగా డిఈవో అభినందించారు. కథలంటే పిల్లలకు చాలా ఇష్టమని ఇందులో వారి ఊహాశక్తి అద్భుతంగా ఉందన్నారు. 39 మంది బాల బాలికలు కథలు రాయడం సంతోషంగా ఉందన్నారు. గతంలో కవిత్వ సంకలనం తొలిజల్లు, ఇప్పుడు కథల సంకలనం పున్నాగపూలు రావడం చాలా హర్షణీయమన్నారు. మరిన్ని సంకలనాలు ఈ పాఠశాల నుండి రావాలని ఆకాంక్షించారు. కథలు రాసిన పిల్లలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ బాల సాహితివేత్త కన్నెగంటి వెంకటయ్య సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో బాల సాహితివేత్తలు కొమ్మవరపు కృష్ణయ్య, జి. శ్రీనివాసు, షఫీ, సుజాత, కొల్లు వెంకటేశ్వరరావు, జాషువా సాహిత్య వేదిక ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి వెంకటేశ్వర్లు, టిజీవో నాయకులు నయూం పాషా, పాఠశాల ఉపాధ్యాయులు సంధ్య, తిరుపతమ్మ, శ్రీదేవి, వై. వెంకటేశ్వర్లు, శశికళ, కమల, ఉస్మాన్ అలీ, శ్రీరాం మూర్తి, జైపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పివోలు, ఏపివోలు అవగాహన కలిగి ఉండాలి

**ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పోలింగ్ రోజు చేయాల్సిన విధులు, బాధ్యతలపై ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఏఈఆర్‌వో, నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం ఎస్ఆర్‌అండ్‌బిజిఎన్ఆర్ కళాశాలలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ విధులు, బాధ్యతలపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి తనిఖీ చేశారు. ఎస్ఆర్‌అండ్‌బిజిఎన్ఆర్ కళాశాలలో ఖమ్మం, వైరా నియోజకవర్గ ఏపివోలకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆదర్శ్‌సురభి మాట్లాడుతూ పోలింగ్ రోజున నిర్వహించే విధుల పట్ల, ఈవిఎం యంత్రాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందు మాక్ పోలింగ్ నిర్వహించే విధానం పై పోలింగ్ ఏజెంట్లకు వివరించి వారి సమక్షంలో మాక్ పోలింగ్ జరపాలన్నారు. హ్యాండ్‌బుక్‌లోని ప్రతి అంశాన్ని తెలుసుకుని ఉండాలని, పోలింగ్ సామాగ్రి మొత్తాన్ని సేకరించుకోవాలన్నారు. బ్యాలెట్ గోప్యతను కాపాడేవిధంగా ఓటింగ్ కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు అవసరమైన సహాయాన్ని అందించడానికి బిఎల్‌వోల ద్వారా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఏమైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుని వంద శాతం ఎన్నికల నిర్వహణ విజయవంతం చేయాలని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పోలింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈవిఎం యంత్రాలతో హ్యాండ్స్ ఆన్ శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం పార్లమెంట్‌ను బిఆర్ఎస్ గెలిచితీరుతుంది : నామ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ఖమ్మం పార్లమెంట్‌ను బిఆర్ఎస్ పార్టీ గెలిచి తీరుతుందని ఖమ్మం ఎంపి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని నరసాపురం గ్రామంలోగల శ్రీశ్రీశ్రీ కొటమ్మ అమ్మవారి ఆలయం నందు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసమావేశంలో ఆయన పాల్గొని మాట్లడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. వంద రోజుల్లో అన్ని పథకాలు అమలు చేస్తామని 4 నెలలు గడిచినా ఇప్పటి వరకు అమలు చెయ్యలేదని ఆరోపించారు. రైతులకు రుణామాఫీ చేయడంలో విఫలం అయ్యారని, అదే విధంగా మహిళలు ప్రతి నెల రూ 2500 అందించడం లేదన్నారు. రైతు బంధు రూ 15వేలు ఇస్తామని చెప్పి నేడు అమలు చేయడంలేదని ఆరోపించారు. వీటి అన్నిటిని ప్రజల్లోకి తీసుకొని వెళ్ళాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు అందరు సమిష్టిగా కృషి చేసి బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసిన కార్యకర్తలు అసలైన కార్యకర్తలని వారికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. రేపటి నుంచి ప్రతి మండలంలో బూత్ కమిటీలు , ప్రతి బూత్‌కు వెళ్ళి కేసీఆర్ చేసి పనులు ప్రతి ఓటరుకు చెప్పాలన్నారు. అలాగే తెలంగాణ అభివృద్ధి జరగాలంటే ఢిల్లీలో కొట్లాడే పార్టీ బిఆర్ఎస్ పార్టీ ఒక్కటేనని తెలపారు. ఈకార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రరావు, ఎంఎల్‌సి, ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధు, బిఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు, మాజీ ప్రభుత్వ విప్, పినపాక మాజీ శాసన సభ్యులు రేగా కాంతారావు, మాజీ ఎంఎల్ఏలు తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు, సంక్ర వెంకటవీరయ్య, ఒగ్గెల పూజ, సున్నం నాగమణి, మడ్ల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా నిలిచిపోయిన పనులపై ఎంపిడివో ఆగ్రహం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పనులు అసంపూర్తిగా నిలవటంపై ఎంపిడివో అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మన ఊరి మనబడి పనులను ఆయన పరిశీలించారు. వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి కాకపోవడం, ట్యాపులు క్రిందకు అమర్చడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు ఎందుకు జాప్యం జరుగుతున్నాయని ప్రధానోపాధ్యాయున్ని అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తిచేసేలా అధికారులు సదరు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకురావాలన్నారు. విద్యార్థులకు నీటి సమస్య తలెత్తకుండా ఉండాలన్నారు.

# సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల ప్రజలు దశాబ్దాల కాలంగా ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావుకు ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ అతహర్ వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఇల్లందు పట్టణంలో ముఖ్య కార్యకర్తల సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు విచ్చేసిన సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ప్రధాన సమస్యలు అయినటువంటి కొత్తగూడెం జిల్లా కేంద్రం నుంచి ఆళ్లపల్లికి డబుల్ రోడ్, అలాగే మర్కోడు నుంచి కరకగూడెం రోడ్డు అలాగే ఆళ్లపల్లి మామ కన్ను మధ్యలో గల కిన్నెరసాని నదిపై వంతెన నిర్మాణాలు, అటవీ శాఖ అనుమతులు లేక నిలిచిపోయాయని సంబంధిత అధికారులతో మాట్లాడి అనుమతులు ఇప్పిస్తే కొత్తగూడెం నుంచి ఆళ్లపల్లి మీదుగా ములుగు వరంగల్ జిల్లాలకు ఆళ్లపల్లి నుంచి పినపాక నియోజకవర్గం మీదుగా ఏటూర్‌నాగారం మేడారం వెళ్ళుటకు ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, తద్వారా రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందని తెలియజేశారు. ఈసందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల స్పందిస్తూ త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో పరమ ప్రభాకర్, మహమ్మద్ ఫయిూం, శ్రావణ్, శేఖర్, సదానంద చారి, మూతిర్, టి శేఖర్ పాల్గొన్నారు.

# ఏక రూప దుస్తులు కుట్టుటకు శిక్షణ



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో దర్జీలకు పాఠశాలల పరిధిలోని విద్యార్థినీ విద్యార్థులకు రాబోయే విద్యా సంవత్సరంలో ఏకరూప దుస్తులు కుట్టుటకు శిక్షణ కార్యక్రమమును కల్లూరు లోని స్త్రీ శక్తి భవనంలో అవగాహన కార్యక్రమం జరిగింది. రాబోయే విద్యా సంవత్సరానికి గాను 3300 మంది విద్యార్థిని విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే కుట్టిన ఏకరూప దుస్తులు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలోని గ్రామ సమాఖ్యలనుంచి దర్జీలు ఏకరూప దుస్తులు కుట్టేందుకు అవగాహన కార్యక్రమంను కల్పించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఐకెపి ఎపిఎం వెంకట రామారావు, సీసీలు, గ్రామ సమాఖ్యలు, దర్జీలు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు నూతన వస్త్రాల పంపిణీ



**ప్రజాపక్షం/వైరాః** గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో వైరా మండల పరిధిలోని పాలడుగు, గొల్లెనపాడు గ్రామాల్లో జిఎస్ఎస్ డేకేర్ సెంటర్‌లలో 140 మంది నిరుపేద విద్యార్థులకు మంగళవారం పంచాయతీ కార్యదర్శి గరికపాటి కుమార్, విశ్రాంత ఉపాధ్యాయుడు వనమా చిన్న సత్యనారాయణ చేతుల మీదుగా వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు , గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం గ్రేస్ సర్వీస్ సొసైటీ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ కేర్ సెంటర్‌ల ఇంచార్జిలు మోదుగు వినోద్‌కుమార్, గంజి రోశమ్మ, సంస్థ ప్రతినిధులు మురళి, కృష్ణారెడ్డి, సుందర్‌రావు, డేకేర్ సెంటర్ టీచర్లు రాజేష్, ప్రశాంతి, ఆయా మణి, స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.

# 11న టియుడబ్ల్యుజె (ఐజెయు) నియోజకవర్గ సమావేశం



**ప్రజాపక్షం/వైరాః** వైరా నియోజకవర్గ టియుడబ్లుజె (ఐజెయు) జర్నలిస్టు యూనియన్ సంఘం సమావేశం ఈ నెల11న వైరాలో ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుంది. ఈ సమావేశంలో జిల్లా నాయకులు పాల్గొంటారు. వైరా, కొణిజర్ల , ఏన్కూరు, జూలురుపాడు, కారేపల్లి మండలాల్లోని జర్నలిస్టు సోదరులు ఈ సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని పలువురు జర్నలిస్టులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్కిరాల శ్రీనివాసరావు, ఏపూరి రాజారావు, మేడా సంపత్, పులి కృష్ణార్జున్‌రావు, గద్వాల్ రవీందర్, ఆదూరి ప్రేమ్, గొల్లమందల విజయ్‌కుమార్, ఏడునూతల బుచ్చి రామారావు, సూతకాని శ్రీకాంత్, అక్కిశెట్టి రవితేజ, అలావుల్లా, వెన్నపూస వీరారెడ్డి, గొల్లమందల బాబు, పోచం శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

-ఎకరాకు రూ. 25వేల పరిహారం చెల్లించాలి
-నామ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు బిఆర్ఎస్ నేతల వినతి





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, పంట నష్టపోయిన రైతులకు సత్వరమే ఎకరాకు రూ. 25 వేల నష్ట పరిహారం చెల్లించాలని బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం పార్లమెంటు అభ్యర్థి నామ నాగేశ్వరరావు తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని, ధాన్యం కొనుగోలుకు సంబంధించి అదనంగా ఇస్తానన్న రూ. 500 బోనస్ ఇవ్వాలని, మంచినీటి ఎద్దడిని నివారించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బిఆర్ఎస్ ఖమ్మం పార్లమెంటు అభ్యర్థి నామ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ప్రతినిధి బృందం మంగళవారం జిల్లా కలెక్టర్ విపి గౌతమ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఎంపి నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ తాగు, సాగునీటి ఎద్దడితో ప్రజలు, రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని గతంలో ఎన్నడు లేని విధంగా పరిస్థితి నెలకొందన్నారు. సమస్యలను పరిష్కరించేంత వరకు ప్రభుత్వాన్ని వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. సాగునీరు అందక చేతికి వచ్చిన పంట ఎండిపోయిందని వరి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే సర్వే చేసి ఎంత నష్టం జరిగిందో అంచనా వేసి రైతులకు వెంటనే ఎకరాకు రూ. 25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అదనంగా రూ. 500 బోనస్ అందిస్తామని తెలిపిందని వెంటనే వాటిని అమలు చేయాలని నామ డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రతినిధి బృందం జిల్లా వ్యాప్తంగా పర్యటించి వరి, మొక్కజొన్న తదితర పంటలకు సంబంధించి పంట నష్టాన్ని అంచనా వేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి సత్వరమే రైతులకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు నామ తెలిపారు. ఎంపి వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో ఎన్నడు లేనివిధంగా రాష్ట్రంలో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కారణంగానే తాగు, సాగు నీటికి ఇబ్బందులు తలెత్తాయన్నారు. నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్లపైకి వస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎంఎల్‌ఏలు మదన్ లాల్, కొండబాల కోటేశ్వరరావు, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మతతత్వ బిజెపిని ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి మతం, కులం పేరుతో ప్రజల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టి మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న బిజెపిని ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మాచర్ల భారతి పిలుపునిచ్చారు. మంగళవారం తల్లాడలోని సిపిఎం కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశం నల్లమోతు మోహన్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దేశ లౌకిక ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ స్వతంత్ర సంస్థలైన ఈడి, సిబిఐ, ఐటి సంస్థలను తమ జేబు సంస్థలుగా ఉపయోగించుకుంటుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతుందని, ప్రజా సమస్యలను పరిష్కరించకుండా దేశభక్తి పేరుతో పౌరసత్వాన్ని ముందుకు తీసుకొస్తుందన్నారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపి దాని మిత్ర పక్షాలను ఓడించాలని, ఇండియా కూటమిని గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజాస్వాంకవాదులుగా మనపై ఉందన్నారు. ఈసమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, జిల్లా నాయకులు తాతా భాస్కర్‌రావు, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, సేలం సత్యనారాయణరెడ్డి, కళ్యాణపు కృష్ణయ్య, షేక్.మస్తాన్, నన్నేసాహెబ్, రాజబోయిన సైదులు, చల్లా నాగేశ్వరరావు, ఆదూరి జీవరత్నం, సత్తెనపల్లె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు సామాన్యుడి చేతిలో వజ్రాయుధమే..




**ప్రజాపక్షం/పినపాక:** ఎంతోమంది త్యాగధనుల పోరాట ఫలితంగా ఓటు హక్కు సాధించామని, ఓటు హక్కు ద్వారా ప్రజలే పాలకులవుతారని పినపాక ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మంగళవారం పినపాక మండల కేంద్రంలో ఓటు వినియోగం పై ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏపీవో జ్యోతి హాజరై శ్రీ శక్తి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పినపాక మండల కేంద్రం నుండి ఈ బయ్యారం క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఓటు వజ్రాయుధం అంటూ ఓటును అమ్ముకోవద్దంటూ స్థానికులు నినాదాలు చేశారు. ఓటుకు ఉన్న విలువను తెలియజేస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు మీ భవిష్యత్తు అంటూ ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధం అంటూ నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈ బయ్యారం సెక్రటరీ జైపాల్ రెడ్డి, ఏపీఓ వీరభద్ర స్వామి, ఐకెపి వివోలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరుగూడెంలో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వేంసూరు మండలం లోని కల్లూరుగూడెం గ్రామం లో పామాయిల్ ఫ్యాక్టరీ ని ఏర్పాటు చేయాలని మండల రైతులు ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్ కు వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వం ఈ గ్రామంలో 40 ఎకరాల భూమిని పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం కేటాయించిందన్నారు. ప్రహరీ కూడా నిర్మించారన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేయాలన్నారు. వేంసూరు మండలం లో రెండు వేల మంది రైతులు పామాయిల్ సాగు చేస్తున్నారన్నారు. అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీలకు గెలలను తోలుకోవాల్సి వస్తుందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బొట్టు విక్రమార్క దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరిస్తానని డాక్టర్ రాగమయి హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా మంత్రి సలహాలు, సూచనలు తో పామాయిల్ ఫ్యాక్టరీ అనుమతి, నిర్మాణం కొరకు కృషి చేద్దాం అని వేంసూరు మండలం రైతులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు కాసర్ల చంద్రశేఖర్ రెడ్డి, వెల్ది జగన్మోహన్‌రావు, పుచ్చకాయల సోమిరెడ్డి తదితరులు ఉన్నారు.

# వడదెబ్బ తగులకుండా జాగ్రత్తలు పాటించాలి





**ప్రజాపక్షం/ మధిర :** ప్రస్తుత వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగులకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హెచ్.వీరబాబు సూచించారు. మంగళవారం జరిగిన సమావేశంలో వైద్యాధికారి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది ప్రతిరోజు గృహ సందర్శన చేయాలని, టార్గెట్ కపుల్స్‌ను గుర్తించి 12 వారాల లోపు గర్భిణీ స్త్రీని నమోదు చేయాలని, మురికి నీరు నిల్వలేకుండా పరిసరాలను పరిశ్రుభంగా ఉంచుకోవాలని ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్ఎస్ ప్రాణరక్షక ద్రావకమని, ఉష్ణోగ్రతలు పెరగడం వలన వడదెబ్బ తగిలే అవకాశం ఉందని, వడదెబ్బ లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి తరలించాలని తెలిపారు. ఈ సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్లు శరత్‌బాబు, భాస్కర్‌రావు, సుభాషిణి, ఎంఎల్‌పిహెచ్ ప్రదీప్, డిఇఓ కిరణ్‌బాబు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలకు పరామర్శ



**ప్రజాపక్షం/ మధిర :** జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు మంగళవారం పలు కుటుంబాలను పరామర్శించారు. పట్టణంలోని సిద్దారెడ్డి బజార్‌లో రెంటపల్లి కోటయ్య మృతి చెందగా వారి భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం బిఆర్ఎస్ నాయకులు కుంచెం కృష్ణారావు తల్లి ఇటీవల మృతి చెందగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కనుమూరి వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అప్పారావు, నాగులవంచ రామారావు, వేముల శ్రీనివాసరావు, వేల్పుల శివ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో అన్నదానం



**ప్రజాపక్షం /మధిర :** కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించే ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి మల్లు నందినికి కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు కోనా సత్యనారాయణగుప్తా, ఫౌండేషన్ అధ్యక్షులు కోనా నర్సింహారావు దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్ కమిటీ అధ్యక్షులు చావా వేణు, నాయకులు తలుపుల వెంకటేశ్వరరరావు, మైలవరపు చక్రి, కర్లపాటి వాసు, జివిఆర్, పాషా, వీనస్, ఖాన్, రసిద్దీన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

# మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి ప్రెస్ క్లబ్ మండల నూతన కమిటీని గౌరవ అధ్యక్షులు గుండ్ల సుధాకర్ అధ్యక్షతన మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొమ్మినేని శివనాగేష్(సాక్షి), ప్రధాన కార్యదర్శిగా మేకల మల్లికార్జున్ యాదవ్(సూర్య), ఉపాధ్యక్షుడిగా షేక్ ఇబ్రహీం(ప్రజాపక్షం), కోశాధికారిగా బండి గురునాథ్(ఆంధ్రజ్యోతి), గౌరవ అధ్యక్షులుగా గుండ్ల సుధాకర్(ఎన్45న్యూస్)ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులు చిలుములు రమేష్, రాయల భిక్షమయ్య పాల్గొన్నారు.

# 'రైతు నేస్తం'ను సద్వినియోగించుకోవాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడిఏ తాతారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రైతు వేదిక నందు రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేలచే రైతు నేస్తం పేరుతో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతులకు నేరుగా సలహాలు, సూచనలు, దృశ్య మాధ్యమం ద్వారా రైతులకు చేరాలనే సంకల్పంతో రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్, ఏవో టెక్ అనిల్, ఇతర మండలాల అధికారులు, బిటిఎం రవికుమార్, ఏఈవోలు జెవిడి ప్రసాద్, రవితేజరెడ్డి, నాగ వైష్ణవి, రైతులు బిజ్జం శ్రీనివాసరెడ్డి, మారం శ్రీనివాసరెడ్డి, గాదె నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎంపిడివో అశోక్ అన్నారు. మంగళవారం ఎంపిడివో కార్యాలయం నుండి ప్రధాన సెంటర్ వరకు ఓటర్లతో ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. అనంతరం ఓటర్లతో మానవహారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏపిఎం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




**-జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా**

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఎండతీవ్రత రోజురోజుకీ అధికమవుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా సూచించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అన్నిమండలాల అధికారులతో జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశ వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండ తీవ్రత పెరుగుతున్న క్రమంలో ఆస్పత్రుల్లో అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో కూలీలు వడ దెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పని వేళలు ఉ.6 గం. నుండి 11 వరకు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. రానున్న రోజుల్లో ఎండతీవ్రత మరింత తగా పెరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తలపై కరపత్రాలు ముద్రించి పంపిణీ చేయాలన్నారు. ఈనెల 17న భద్రాచలం శ్రీరామ నవమికి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారని, అందుకు తగిన ఏర్పాటు చేయాలన్నారు. మధ్యాహ్నం 12 గం. నుండి 3 గం. వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దన్నారు. వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, ఎవ్వరికి అధికారులు సెలువులు ఇవ్వొద్దన్నారు. జూస్ పాయింట్ల వద్ద ఐస్ నాణ్యతనుఇ పతఖి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ విద్యాచందన, అటవీ అధికారి కృష్ణగౌడ్, డిఎంహెచ్‌ఓ శిరీష, వైద్యకళాశాల ప్రిన్సిపల్ లక్ష్మ ణరావు, ఆర్‌అండ్‌బి ఇఇ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పువ్వాడ నగర్, కేసిఆర్ నగర్ పేదలకు న్యాయం చేయండి



**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం**

ప్రజాపక్షం/ ఖమ్మం : పువ్వాడ ఉదయ్ కుమార్ నగర్, కేసిఆర్ నగర్ పేదలకు జిల్లాకు చెందిన మంత్రులు తగు విచారణ చేసి న్యాయం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం విజ్ఞప్తి చేశారు. కేసిఆర్ నగర్‌లో స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించిన స్థలాలకు సంబంధించి విచారణ జరిపించాలని అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకోవాలని కానీ ఆహార్నిశలు కష్టపడి రూపాయి రూపాయి పోగేసి కొనుగోలు చేసిన నిరుపేదలకు అన్యాయం జరగకుండా చూడాలని సలాం కోరారు. మంగళవారం యానాలి సాంబశివరెడ్డి అధ్యక్షతన లెనిన్ నగర్‌లో జరిగిన సిపిఐ సమావేశంలో సలాం మాట్లాడుతూ 58, 59 జీవోల ద్వారా సంపన్న వర్గాలకు రెగ్యులర్ చేస్తున్న అధికార యంత్రాంగం పేదల పట్ల ఎందుకు కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆయన ప్రశ్నించారు. నిజంగా పేదల పట్ల చిత్తశుద్ది ఉంటే ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలకు సంబంధించి నిజ నిర్ధారణ కమిటీ ద్వారా విచారణ జరిపించి అర్హులైన వారికి పట్టాలు ఇవ్వాలని, అనర్హులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. ఒక పథకం ప్రకారం పేదల పై కక్షపూరిత పద్దతుల్లో దాడులు జరుగుతున్నాయని సలాం తెలిపారు. పేదలకు ఇచ్చిన ప్లాట్లను తిరిగి వారికి స్వాధీనం చేయాలని ఒక వేళ ప్రభుత్వ స్థలాల్లో పేదలు ఉంటే వారికి ప్రభుత్వ నిబంధనలకు లోబడి రెగ్యులర్ చేయాలని సలాం కోరారు. ప్రభుత్వ భూములు వెలికి తీయదమంటే పేదలపై ప్రతాపం చూపడం కాదని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు జ్వాలా నర్సింహారావు, ఎండి రెహ్మాన్, డి. శేఖర్ నాయక్, పిచ్చయ్య, రెహ్మాన్, ఖాసింపాషా తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ కాన్పుకు ప్రోత్సహించి కాన్పు అయేలా చేయాలి

ప్రజాపక్షం/మణుగూరు: సాధారణ కాన్పుకు ప్రోత్సహించి కాన్పు అయేలా చేయాలని మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ చైతన్య ఆశా కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు జరుగుతున్న ఆశా కార్యకర్తల (ఆశా డే ) సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీ లను త్వరిత గతిన గుర్తించి వారికి మాత శిశు సంరక్షణ కార్డు ఇచ్చి వారికి టిడి వాక్సిన్ ఇచ్చి, ఐరన్, ఫోలిక్ ఆసిడ్, కాల్షియమ్ టాబ్లెట్స్ ఇచ్చి, వారిని విధిగా డాక్టర్ చెక్ అప్స్ చేయించి, సాధారణ కాన్పు కు ప్రోత్సహించి కాన్పు అయ్యేటట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు అయినా తల్లి బిడ్డలు ఆరోగ్యగా ఉంటారని అన్నారు. అనంతరం ఆసుపత్రిలోని ఈడిడి క్యాలెండర్, రికార్డులను పరిశీలించారు. రక్తహీనత లేకుండా చూడాలని, సికిల్ సెల్ అనెమియా



పరీక్షలు ఎక్కువ చేయాలని, టీబీ శాంపిల్స్ పెంచాలని డాక్టర్ శివ కుమార్, డాక్టర్ నిశాంత్ రావు లు ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ప్రజాపక్షం/సత్తుపల్లి రూరల్: మండల పరిధిలోని కిష్టాపురం గ్రామ పరిధిలో తండాలో తాటాకు ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఇంటికి మంటలు అంటుకోగా మంటలు ఎగిసిపడ్డాయి. వివరాలిలా ఉన్నాయి... ధరవాత్ పోత నాయక్ ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చేలరేగగా స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. రూ. 60 వేల నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. తనను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## లారీ, ట్రాక్టర్ ఢీ.. కూలి మృతి

ప్రజాపక్షం/సత్తుపల్లి రూరల్: మండల పరిధిలోని బేతుపల్లి గ్రామానికి సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై ఓ లారీ ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ఉన్న కూలి జుజ్జునూరి మాధవరావు (53) అక్కడికక్కడే మృతిచెందాడు. వరి గడ్డి లోడుతో నాచారం నుండి దుద్దేపూడి వెళుతున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. మాధవరావు దుద్దేపూడి గ్రామానికి చెందిన కూలీగా తెలిపారు.

## సి విజిల్ పై అవగాహన ర్యాలీ




ప్రజాపక్షం/కరకగూడెం: భారత రాజ్యాంగ ప్రజలకు కల్పించిన వజ్రాయుధం ఓటు అని ఎంపీఓ కుమార్ అన్నారు. వెలుగు, ఎంపీడీవో కార్యాలయం ఆధ్వర్యంలో సి విజిల్ అవగాహనపై కరకగూడెం ప్రధాన రహదారిపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ కుమార్, త్రిగుణ ఆధ్వర్యంలో సి విజిల్ వ్యాప్ పై అవగాహన కల్పిస్తూ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహించాలనే ఉద్దేశంతో సి విజిల్ వ్యాప్ తీసుకువచ్చిందని ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు అక్రమాలు చేస్తే ఈ యాప్ ద్వారా ప్రజలు ఫిర్యాదు చేయుచ్చు అని వారు తెలిపారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని, ప్రలోభాలకు గురి చేసే వారిని సి విజిల్ వ్యాప్ ద్వారా పట్టిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు శ్యాంసుందర్ రెడ్డి, రమేష్, శ్రీకాంత్, హరినాథ్, రవి, రామకృష్ణ, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, వెలుగు సిసి విజయలక్ష్మి, సరస్వతి, వెలుగు కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/ ఖమ్మం : రంజాన్ ఉపవాసాల పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ముస్లిం యువత ఆధ్వర్యంలో టిఎన్‌జీవోస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం అత్యంత పవిత్రమైందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావిద్, కాంగ్రెస్ నాయకులు కమర్తపు మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## రూ. 6.50 లక్షల నగదు స్వాధీనం



ప్రజాపక్షం/మణుగూరు: వాహన తనిఖీల్లో భాగంగా మంగళవారం కమలాపురం క్రాస్ రోడ్ వద్ద కోట వెంకట అప్పారావు అనే వ్యక్తి వద్ద నుండి ఒక లక్ష యాభై వేల రూపాయలను, ఇట్ల పుల్లారావు అనే వ్యక్తి వద్ద నుండి 5 లక్షల రూపాయలు నగదు మొత్తం మంగళవారం 6 లక్షల 50 వేల రూపాయలను ఎటువంటి పత్రాలు లేకుండా తీసుకువెళ్తుండగా సీజ్ చేసి ఎలక్షన్ ఎఫ్ ఎస్ టి కి అప్పజెప్పడం జరిగిందని మణుగూరు సిఐ సతీష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్ ,హెడ్ కానిస్టేబుల్ రవి, కానిస్టేబుల్ సనై , షమీం తదితరులు పాల్గొన్నారు.

## సుజాతనగర్‌లో బంగారం, నగదు చోరీ



ప్రజాపక్షం/సుజాతనగర్: మండల కేంద్రంలో సుజాతనగర్ మెయిన్ సెంటర్ సమీపంలో నివాసం ఉంటున్న కోమరి నాగేశ్వరరావు ఇంట్లో దొంగతనం జరిగిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి మార్చి 29వ తేదీ శుక్రవారం నాడు తిరుపతి దైవదర్శనానికి వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని సమయం చూసి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో తలుపు, తాళాలు పగలగొట్టి బీరువాను తెరిచి అందులో ఉన్న 30,000 రూపాయల నగదును, చిన్న పిల్లల మూడు ఉంగరాలు, రెండు జతల జోఖీలు కలిపి రెండు తులాల బంగారం ఉంటుందని పట్టాదార్ పాస్ పుస్తకం పోయినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. బాధితులు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## న్యాయవాద సహకార సంఘం ఎన్నికలు

ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ : న్యాయవాద సహకార సంఘం ఎన్నికలు ఈనెల 16న బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. జి. రమేష్ ఎన్నికల అధికారిగా, కె. రవికుమార్ సహాయ ఎన్నికల అధికారిగా ఈ ఎన్నికలను నిర్వహించనున్నారు. నాల్గవ తేదీ నుంచి ఆరవ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను దాఖలు చేయాలని పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ఈనెల 10న ప్రకటిస్తారని ఎన్నికల అధికారులు తెలిపారు. 16న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు ఎన్నికలు జరుగుతాయని అదే రోజు లెక్కింపు జరుగుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు.

## సర్వాయి పాపన్న వర్ధంతి



ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ : ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు నెరళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ 314వ వర్ధంతి జరగగా పాపన్న చిత్ర పటానికి పలువురు న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభలో బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది బిచ్చాల తిరుమలరావు తదితరులు ప్రసంగించారు. సర్వాయి పాపన్న మొఘల్ రాజుల పన్నుల వసూళ్లను, దౌర్జన్యాలను నిరసించారని, జమీందార్ల కోటలను బద్దలు కొట్టి పేదలకు సాయం చేసే వాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి చింతనిప్పు వెంకటేశ్వరరావు, న్యాయవాదులు పోట్ల మాధవరావు, ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, యుగంధర్, గోపి, పట్టాభి, కొత్తా వెంకటేశ్వరరావు, షేక్ లతీఫ్, ఏడునూతల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## స్పాట్ వాల్యూయేషన్‌పై విద్యాశాఖ అధికారికి వినతి



ప్రజాపక్షం/ ఖమ్మం : పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్‌కు సంబంధించి పదవి విరమణకు దగ్గరలో ఉన్న ఉపాధ్యాయులను రంజాన్ దృష్ట్యా ముస్లిం ఉపాధ్యాయులను, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మినహాయింపు ఇవ్వాలని పిఆర్‌టియు ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు .ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు కట్టా శేఖర్‌రావు, నాయకులు శంకర్‌రావు, ఉస్మాన్ అలీ, ప్రభాకర్, శ్రీరాంమూర్తి, సునీత, శ్రీదేవి పాల్గొన్నారు.